ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 25 ఏప్రిల్ 2024

టెర్మినేషన్ విధానాన్ని ఎత్తివేయాలి

కులకచర్ల, ఏప్రిల్ 24: విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగుల టెర్మినేషన్ విధానాన్ని ఎత్తివేయాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ తెలిపారు. బుధవారం ఆయన కులకచర్లలో మాట్లాడుతూ విద్యాశాఖలో బోధనాపరంగా కీలకంగా ఉన్న సమగ్రశిక్ష పీటీఐ ఉద్యోగులను వెంటనే రీ-ఎంగేజ్ చేయాలన్నారు. పీటీఐలకు ఇతర ఉద్యోగులతో సమానంగా 12నెలల వేతనం అందించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీసవేతనం, పే-స్కేల్, రెగ్యులర్ చేయాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో రంగారెడ్డి టాప్!

ఇంటర్ బోర్డు బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియెట్ కోర్సు పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఫస్టియర్ ఫలితాల్లో 71.7శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. సెకండియర్ ఫలితాల్లో 77.63 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానంలో నిలిచింది. అయితే అన్ని గ్రూపుల్లో కలిపి మొదటి సంవత్సర ఫలితాల్లో గతేడాది కంటే ఉత్తీర్ణత 1.3శాతం తగ్గింది. సెకండియర్ రిజల్ట్స్‌లో మాత్రం 2003 ఫలితాలతో పోలిస్తే ఈ సారి 4.63 శాతం పాస్ పర్సెంటేజీ పెరిగింది. ఎప్పటి లాగే ఫలితాల్లో బాలికలదే పైచేయిగా ఉంది. ఇదిలా ఉంటే సెకండియర్‌లో 78.31శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా విద్యార్థులు సెకండియర్‌లో 61.42శాతం, ఫస్టియర్‌లో 53.11శాతం మంది చొప్పున పాసయ్యారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా కాలేజీల యాజమాన్యాలు అభినందనలు, శుభాకాంక్షలతో ముంచెత్తాయి.

- ఫస్టియర్‌లో71.7శాతం మంది పాస్ .. రాష్ట్రంలో మొదటి స్థానం
- సెకండియర్‌లో 77.63 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్ ఫలితాల్లో మేడ్చల్ రెండో స్థానం, రంగారెడ్డి మూడో స్థానం
- ఫలితాల్లో ఈ సారీ బాలికలదే పైచేయి
- ఒకేషనల్ కోర్సుల్లో తగ్గిన ఉత్తీర్ణత
- మేడ్చల్‌జిల్లాలో ఫస్టియర్‌లో 71.58, సెకండియర్‌లో 78.31శాతం పాస్
- వికారాబాద్ ఫస్టియర్‌లో 53.11, సెకండియర్‌లో 61.42శాతం ఉత్తీర్ణత



ప్రతిభ చూపిన 'శ్రీచైతన్య' విద్యార్థులు

ఆదిభట్ల/ఆమనగల్లు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య బొంగ్లూరు జోన్‌విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బద్దంఅభిరామ్‌గౌడ్, ఎ.అక్షిత్‌కుమార్‌లు 468/470 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో నీరటి నిరంజన్‌రెడ్డి 993/1000 మార్కులు సాధించాడు. ఆమనగల్లుకు చెందిన బోడ మధుశ్రీ ఫస్టియర్ ఎంపీసీలో 470మార్కులకు 467 మార్కులు సాధించింది.



తాండూరు: టపాసులు కాల్చుతున్న చైతన్య కళాశాల అధ్యాపకులు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24: ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఇంటర్మీడియెట్ ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండియర్ ఫలితాలు వచ్చేశాయ్. బుధవారం ఉదయం 11గంటలకు నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, బోర్డు కార్యదర్శి శ్రుతి ఓఝా ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఒకేసారి విడుదల చేశారు. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 71,297 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51,121మంది పాస్ అయ్యారు. రంగారెడ్డి జిల్లా ఫస్టియర్ పాస్ పర్సెంటేజీలో 71.7శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఇంటర్ సెకండియర్‌లో 64,759 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50,273 మంది పాస్ అయ్యారు. ఇందులో 77.63శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినా గతేడాది ఫలితాలతో పోలిస్తే 1.3 శాతం ఉత్తీర్ణత శాతం తగ్గింది. 2003 ఫస్టియర్‌లో 73శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. అలాగే సెకండియర్ ఫలితాలను పరిశీలిస్తే.. గత ఏడాది కంటే ఈ సారి 4.63 శాతం పెరిగింది. గత ఏడాది 73శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సారి 77.63శాతం సాధించారు.

బాలికలదే హవా

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఈ సాదీ బాలికల హవా కొనసాగింది. ఇంటర్ ఫస్టియర్, సెకండ్ ఇయర్ రెండింటిలోనూ బాలికలే పైచేయిగా నిలిచారు. ఇంటర్ ఫస్టియర్‌లో 37,576 మంది బాలురు పరీక్షలు రాయగా 23,516 మంది పాసయ్యారు. 67.18 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే 33,271 మంది బాలికలు పరీక్షలు రాయగా 25,879 మంది పాస్ అయ్యారు. 76.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 33,859 మంది బాలురు పరీక్షలు రాయగా 25,069 మంది పాస్ అయ్యారు. 74.04 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 30,900 మంది బాలికలు పరీక్షలు రాయగా 25,204 మంది బాలికలు పాస్ అయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఒకేషనల్‌లో

ఇదిలా ఉండగా ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఒకేషనల్ కోర్సుల్లో బాలికలు సత్తా చాటారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 3,580 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1,819 విద్యార్థులు పాస్ అయ్యారు. 50.92శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సులోనూ బాలికలదే పైచేయి. 1,949 మంది బాలురు పరీక్షలు రాయగా 665మంది పాస్ అయ్యారు. 34.12శాతం ఉత్తీర్ణత సాధించారు.



సీజే.అరుంధతి
ఎంపీసీ- 991/1000 ,
టీఎస్ మోడల్ కళాశాల,
పూడూరు



ఎండీ మునబ్‌ఖాన్,
బైపీసీ - 988/1000
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



ఎండీ ముజైఫ్‌ఖాన్,
సీఈసీ - 950/1000
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



టి.నిహారిక,
ఎంఈసీ - 921/1000
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



మానస,
ఎంపీసీ- 986/1000,
రిషి కళాశాల,
ఘట్‌కేసర్



హర్షిత,
బైపీసీ- 990/1000,
రిషి కళాశాల,
ఘట్‌కేసర్



మౌనిక,
ఎంపీసీ- 467/470
రిషి కళాశాల,
ఘట్‌కేసర్



మశ్చందర్,
సీఈసీ - 481/500
చైతన్య కళాశాల,
ఘట్‌కేసర్

అలాగే 1,631 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,154 మంది పాస్ అయ్యారు. 70.75శాతం ఉత్తీర్ణత నమైంది. ఇంటర్ సెకండియర్ ఒకేషనల్ పరీక్షల్లో మొత్తం 3,094మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1,919 మంది పాస్ అయ్యారు. 62.02శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ ఒకేషనర్ కోర్సులోనూ బాలికలు సత్తా చాటారు. 1,610 మంది బాలురు పరీక్షలు రాయగా 706 మంది పాస్ అయ్యారు. 43.85 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1,448 మంది బాలికలు పరీక్ష రాయగా 1,213 మంది బాలికలు పాస్ అయ్యారు. 81.74 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఒకేషనల్‌లో తగ్గిన ఉత్తీర్ణత

గత ఏడాది వెలువడిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఒకేషనల్ పరీక్ష ఫలితాలను పరిశీలిస్తే.. ఈ సారి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. గతేడాది ఫస్టియర్‌లో 52శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సారి 50.92 శాతం నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి ఉత్తీర్ణత 1.08శాతం తగ్గింది. సెకండియర్ ఒకేషన్ పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే.. గత ఏడాది 71శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ సారి 62.02శాతంగా నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి 8.98 శాతం ఉత్తీర్ణత తగ్గింది.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

రీ కౌంటింగ్, రీ వాల్యుయేషన్ చేసుకునే విద్యార్థులకు ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు తక్కువ మార్కులు తెచ్చుకున్న వారికి మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు.

అమ్మాయిలదే అగ్రస్థానం

- వికారాబాద్ జిల్లాలో పెరిగిన ఉత్తీర్ణత శాతం

ఆంధ్రజ్యోతి, వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలో ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అమ్మాయిలు అగ్రస్థానంలో నిలిచారు. ప్రథమ సంవత్సరంతో పాటు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లోనూ వారు సత్తా చాటుకున్నారు. సెకండియర్ జనరల్ విభాగంలో 61.42శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 27వ స్థానంలో నిలవగా, ప్రథమ సంవత్సరం జనరల్ పరీక్షల్లో 53.11శాతం ఉత్తీర్ణతతో జిల్లా 22వ స్థానంలో నిలిచింది. ఒకేషనల్ సెకండియర్‌లో 67.55శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 14వ స్థానంలో, ప్రథమ సంవత్సరంలో 52.85 శాతంతో 17వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 6,456 మంది విద్యార్థులు హాజరు కాగా 3,965 మంది పాసయ్యారు. 3,010 మంది బాలురు పరీక్షలు రాయగా 1,613 మంది పాసయ్యారు. బాలికలు 3,446 మంది హాజరు కాగా 2,352 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 6,455 మంది హాజరు 3,428 మంది ఉత్తీర్ణులయ్యారు. 3,012 మంది బాలురకు 1,302 మంది పాసయ్యారు. బాలికల్లో 3,443 మందికి 2,126 మంది పాసయ్యారు.

వికారాబాద్ జిల్లా(జనరల్)		
ప్రథమ సంవత్సరం	53.11 శాతం	22వ స్థానం
ద్వితీయ సంవత్సరం	61.42 శాతం	27వ స్థానం

ఒకేషనల్ కోర్సుల్లోనూ సత్తా చాటిన అమ్మాయిలు

ఒకేషనల్ కోర్సుల ఫలితాల్లోనూ అమ్మాయిలదే పైచేయిగా నిలిచింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 1,242 మంది హాజరైతే 839 మంది ఉత్తీర్ణత సాధించారు. 425 మంది బాలురల్లో 186 మంది, 817 మంది బాలికలు పరీక్షలకు హాజరైతే 653 మంది ఉతీర్ణులయ్యారు. బాలురు 43.76శాతం, బాలికలు 79.93శాతం పాసయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 1,353 మంది విద్యార్థులు హాజరైతే 715 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 525 మందికి 194, బాలికల్లో 828 మందికి వారిలో 521 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 36.95శాతం, బాలికలు 62.92శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఫలితాల్లో గతం కంటే మెరుగుదల

గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఇంటర్ పరీక్ష ఫలితాలు కొంత ఊరట కలిగించాయి. 2003 సెకండియర్ జనరల్ కోర్సుల్లో 60శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 25వ స్థానంలో నిలిచింది. ఈ సారి ఉత్తీర్ణత 61.42శాతానికి పెరిగింది. 2003 ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 46శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 30వ స్థానంలో నిలిచింది. ఈ సారి 53.11శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతంలో మెరుగైనా మిగతా జిల్లాలతో పోలిస్తే ఇంకా మంచి ఫలితాలు సాధించాల్సి ఉంది. ఒకేషనల్ కోర్సు ద్వితీయ సంవత్సరంలో ఈ ఏడాది 67.55 శాతం మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో 58.85శాతం మంది పాసయ్యారు.

మేడ్చల్‌లో 74.94శాతం ఉత్తీర్ణత

ఆంధ్రజ్యోతి, మేడ్చల్ : ఇంటర్ ఫలితాల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. 74.94శాతం ఉత్తీర్ణత సాధించింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 71.58 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 78.31శాతం పాసయ్యారు. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 1,23,671 మంది పరీక్షలు రాయగా 93,149 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 64,828 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 46,407 మంది పాసయ్యారు. బాలురు 23,551 మంది 22,891 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు 10శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం.సెకండ్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో 78.31శాతం ఉత్తీర్ణత సాధించారు. 58,933 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 46,742 మంది(78.31) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలీకలు 26,708 మందికి గాను 22,293 మంది పాసయ్యారు.అలాగే బాలురు 32,225 మంది పరీక్షలు రాయగా 24,449 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ యాజమాన్య కాలేజీల్లో ఉత్తమ ఫలితాలు

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల ప్రథమ సంవత్సరం విద్యార్థులు 63.56 శాతం మంది పాసయ్యారు. ప్రభుత్వ యాజమాన్య కాలేజీల విద్యార్థులు 2,868 మంది పరీక్షలు రాయగా 1,823 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు 1,553 మంది పరీక్షలకు హాజరైతే 557 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ కళాశాలలకు విద్యార్థులు 3,387మందికి 1,763 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర పరీక్షల్లో వివిధ ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు 67.4శాతం మంది పాసయ్యారు. ప్రైవేట్ కాలేజీల విద్యార్థులు 52.52శాతం మంది పాసయ్యారు. ప్రభుత్వ యాజమాన్య కళాశాలల విద్యార్థులు 2,657 మందికి 1,791 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు 1,923 మందికి 1,007 మంది ఉత్తీర్ణత111 సాధించారు. ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు 4,476 మందికి గాను 2,351 మంది ఉత్తీర్ణులయ్యారు.



బి.నితిన్‌కుమార్
ఎంపీసీ - 463/470
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



అఫియా మహజబీన్-
బైపీసీ - 437/440
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



సనాఅఫ్రీన్
సీఈసీ- 479/500
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



జి.హరిత
ఎంఈసీ - 489/500
సిద్ధార్థ కళాశాల,
వికారాబాద్



ఫాతిమా,
బైపీసీ - 432/440
రిషి కళాశాల,
ఘట్‌కేసర్



గంగోత్రి,
ఎంఈసీ, 493/500
రిషి కళాశాల,
ఘట్‌కేసర్

చివరి దశకు నామినేషన్లు

చేవెళ్ల స్థానానికి ఆరో రోజు 19, మల్కాజిగిరికి 38

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/మేడ్చల్, ఏప్రిల్ 24 : నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగుస్తుండడంతో అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలుచేస్తున్నారు. బుధవారం ఆరోరోజు చేవెళ్ల స్థానానికి 19 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 56నామినేషన్లు దాఖలైనట్టు ఆర్వో శశాంక తెలిపారు. ఉదయం 11 నుంచి 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఇప్పటికే ఒకసెట్ నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ఆయన ప్రతిపాదకుడు తోక అంజన్‌కుమార్ మరో రెండుసెట్లు దాఖలుచేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మహ్మద్ అలీ, దాసరి సాహితి, అంకగళ్ల ప్రవీణ్‌కుమార్, మహ్మద్ ఎక్బాల్, కాతుల యాదయ్య, జి.మల్లేశంగౌడ్, జె.దుర్గప్రసాద్, ఎస్.గోపాల్, ఎం.సతీష్‌సాగర్, ఎస్.శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి తాహెర్‌కమల్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చెంచురెడ్డి పద్మావతి నామినేషన్ వేశారు. యాంటీ కరప్షన్ డైనమిక్ పార్టీ అభ్యర్థిగా సుంకె సంపత్, జై స్వరాజ్ పార్టీ అభ్యర్థిగా సుగురు శ్రీనివాస్, దేశ్ జన్‌హిత్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షకీల్, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పాని ప్రసాద్ కటకం, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా పి.గోవింద్ నామినేషన్ వేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి బుధవారం 38నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి రోడ్‌షోగా తరలివచ్చి అంతాయపల్లి వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని లక్ష్మారెడ్డితో కలిసి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానందలతో కలిసి లక్ష్మారెడ్డి నామినేషన్ వేశారు.



బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న తోక అంజన్‌కుమార్

నేటితో ముగియనున్న నామినేషన్ పర్వం

రాజకీయ నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపే వారు అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది. లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల దాఖలుకు గురువారంతో గడువు ముగియనుంది. కాగా నేడు మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశముంది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఇప్పటికే ఒకసెట్ నామినేషన్ జిల్లా ఎన్నికల అధికారి శశాంకకు దాఖలు చేశారు. నేడు ఆయన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నారు.

చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెలుగు నటి

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమాని, నటి దాసరి సాహితి ఎన్నికల బరిలో దిగుతున్నారు. పొలిమేర, పొలిమేర-2 సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న నటి సాహితి లోక్‌సభ ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎంపీ స్థానం నుంచి బుధవారం స్వతంత్ర అభ్యతర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంకు అందజేశారు. 'విత్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' సింగర్ సునీత కుమారుడు ఆకాశ్ నటించిన సర్కారు నౌకరీ సినిమాలోనూ సాహితి నటించారు. పొలిమేర సినిమాలో గెటప్ శ్రీను భార్యగా నటించిన సాహితి 'పొలిమేర-2లో సత్యం రాజేష్ సరసన నటించారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంకకు నామినేషన్ పత్రాన్ని సమర్పిస్తున్న నటి దాసరి సాహితి

మేడ్చల్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం



మేడ్చల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి) : మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో భాగంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు వ్యయ, జనరల్, పోలీసు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. వ్యయ పరిశీలకులుగా మనోజ్ అలోయిస్ లక్రా, ఐఎ అండ్ ఏఎస్‌గా ధ్రువ్‌భోళా, జనరల్ అబ్జర్వర్‌గా ఎంఎస్ ప్రియాంకాశుక్లా, పోలీసు అబ్జర్వర్‌గా రామేశ్వర్‌సింగ్‌లను నియమించినట్లు తెలిపారు. పరిశీలకులు జిల్లా కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని, ఎన్నికల నిర్వహణలో ఏమైనా సందేహాలు ఉంటే వీరిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పరిశీలకులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివరించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వ్యయ, జనరల్, పోలీసుపరిశీలకులు పరిశీలిస్తారని, ఎన్నికలు ముగిసేవరకు వీరు జిల్లాలోనే ఉంటారని తెలిపారు.

ఎల్‌టీటీ ట్రైన్ ఇంజన్‌లో సాంకేతిక లోపం

- తాండూరులో రెండు గంటల పాటు నిలిచిన రైలు

తాండూరు, ఏప్రిల్24: ముంబై నుంచి వైజాగ్ వెళ్తున్న ఎల్‌టీటీ రైలు తాండూరు - రుక్మాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం ఇంజన్‌లో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. గూడ్స్ రైలుకు సంబంధించిన ఇంజన్‌ను ఎల్‌టీటీ రైలుకు అమర్చి తిరిగి తాండూరు తీసుకొచ్చారు. టెక్నీషియన్ ద్వారా ఇంజన్‌సరి చేయించాలని ప్రయత్నించినప్పటికీ సాంకేతిక లోపం మేజర్ కావడంతో గూడ్స్ రైలు ఇంజన్‌ను ఎల్‌టీటీ రైలుకు అటాచ్ చేసి హైదరాబాద్‌కు పంపించారు.ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు రెండు గంటలపాటు రైలు తాండూరులోని నిలిచిపోయింది.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు

● వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

బషీరాబాద్, ఏప్రిల్ 24: సీడ్స్, ఫర్టిలైజర్ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ హెచ్చరించారు. బుధవారం బషీరాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో స్టాక్‌ను స్వయంగా చూసి రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం యూరియా, డీఏపీ ఎంత నిల్వ ఉందనే విషయమై యజమానులతో ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు, మందులు, విత్తనాలను ఇష్టానుసారంగా రైతులకు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. దుకాణాల్లో స్టాక్‌బోర్డు, ధరల పట్టిక విధిగా ఉంచాలని సూచించారు. నిరంతరం తనిఖీలు ఉంటాయని, ఏదైనా తేడావస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. ఆయనతో వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఏవో గోపాల్

కొడంగల్ బస్టాండ్ అభివృద్ధికి కృషి

కొడంగల్, ఏప్రిల్ 24: కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్టీసీ ఈడీ పురుషోత్తం అన్నారు. ఈమేరకు ఆయన బుధవారం బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా గ్రీన్‌పార్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బస్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆయనతో తాండూరు డిపో మేనేజర్ మమత, అసిస్టెంట్ మేనేజర్ నిర్మల, కంట్రోలర్ చారి తదితరులు ఉన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఈడీ పురుషోత్తం

నేటి నుంచి ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు

తాండూరు, ఏప్రిల్ 24: తాండూరు పట్టణంలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 25 నుంచి మే 2వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పదో తరగతికి సంబంధించి సెయింట్‌మార్క్స్ హై స్కూల్, నలంద హైస్కూల్‌లో ఇంటర్మిడియట్‌కు సంబంధించి గవర్నమెంట్ హైస్కూల్ నెం-1, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బాలికల హైస్కూల్, పాత తాండూరు బాలికల ఉర్దూ మీడియం హైస్కూళ్లలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాల్లో కలిపి 10వ తరగతిలో 300 మంది, ఇంటర్‌లో 650 మంది పరీక్షలు రాయనున్నారు. తాండూరు ఎంఈవో వెంకటయ్య ఆధ్వర్యంలో పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్ జరుగుతాయని ఎంఈవో వివరించారు.

వచ్చేనెల 4న వికారాబాద్‌కు మోదీ

వికారాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 4వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికారాబాద్‌కు రానున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక చోట మోదీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో వికారాబాద్‌లో మోదీ బహిరంగ సభ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపారు. హైదరాబాద్ శివారులో రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇంతకు ముందు మోదీ, అమిత్‌షాలతో కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో ఈసారి వికారాబాద్ జిల్లా కేంద్రంలో మోదీ బహిరంగ సభ నిర్వహించాలని స్థానిక పార్టీ నాయకత్వం పట్టుదలతో ఉంది. మోదీ బహిరంగ సభ వికారాబాద్‌లో నిర్వహించాలా ? లేక చేవెళ్లలో నిర్వహించాలా ? ఎక్కడ మోదీ సభ నిర్వహిస్తే ఓటర్లపై ఎక్కువ ప్రభావం చూపుతుందనే విషయమై పార్టీ రాష్ట్ర నాయకత్వం స్థానిక నాయకత్వాలతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్‌లో మోదీ బహిరంగ సభ నిర్వహిస్తే ఆ ప్రభావం జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌తో పాటు రంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాలపై కూడా ఆ ప్రభావం ఉంటుంది. కాగా, మోదీ బహిరంగ సభ నిర్వహించేందుకు అనుకూలమైన స్థలాలను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక ఎస్ఏపీ కళాశాలతో పాటు మద్గుల్ చిట్టంపల్లి పరిసరాలను కూడా బహిరంగ సభ నిర్వహించేందుకు పరిశీలించారు. ఒకటి, రెండు రోజుల్లో మోదీ బహిరంగ సభ విషయమై స్పష్టత రానుంది.

నేటి నుంచి సుల్తాన్‌పూర్ ఉర్సు

పరిగి, ఏప్రిల్ 24: మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో హజ్రత్ సయ్యద్ ఆష్రఫొద్దీన్ అలియా అల్ మరూఫ్ పీర్ గాయబ్ సాహెబ్ ఉర్సే షరీఫ్ ఉర్సు ఉత్సవాలు ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు మహమ్మద్ ఉస్మాన్ తెలిపారు. మహ్మద్ ఓవైసీ రజాఖాద్రి సాహెబ్‌అల్ మరూఫ్, సోహేల్ రజాఖాద్రి, దౌలత్‌ఖాన్ ఆరాధనలు ఉంటాయన్నారు. దర్గా పీఠాధిపతి ఉస్మాన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉర్సు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 25న గురువారం సాయంత్రం ఖవ్వాలీ, అనంతరం గ్రామంలోని ఆశ్రమం దగ్గర నుంచి ప్రధాన వీధుల ఊరేగింపు, గంధం చందన పూజ ఉంటుందని తెలిపారు. 26న శుక్రవారం దర్గా షరీఫ్ ఆవరణలో దీపారాధన, ఖవ్వాలీ కార్యక్రమాలు, 27న ప్రత్యేక నమాజ్ ఉంటుందన్నారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు రంగారెడ్డి జిల్లాతో పాటు, హైదరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, పక్క రాష్ట్రాలకు చెందినవారు హాజరవుతారని నిర్వాహకులు చెప్పారు.



అల్లాపూర్ శివారులో వ్యవసాయ పొలాల మధ్య అక్రమంగా నింపిన ఇసుక

ఇసుక దొంగలను పట్టుకునేదెవరు?

బషీరాబాద్, ఏప్రిల్ 24: మండలంలోని అల్లాపూర్, దామర్‌చెడ్ శివారులోని వాగులు, వంకల్లో కొందరు దొంగలు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. అంతటితో ఆగకుండా సమీప వ్యవసాయ పొలాల్లోని వాడుకల్లోకి వెళ్లి ఇసుకను తవ్వుకెళ్తున్నారు. ఈ విషయమై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా కట్టడి కావడంలేదని రైతులు చెబుతున్నారు. అల్లాపూర్-దామర్‌చెడ్ మార్గం పక్కన వ్యవసాయ పొలాల్లోకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న దారుల్లో వెళ్లి అక్కడి వాడుకల్లో ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకను ఎక్కడబడితే అక్కడ తవ్వి ట్రాక్టర్లలో ఇష్టారాజ్యంగా తరలించడంతో పొలం కాల్వ, పొలంగట్లు వర్షాలకు కోతకు గురై తెగిపోయే ఆవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమదందా నిరాటకంగా కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలాఉండగా ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారులు విధుల్లో బిజీగా ఉండటంతో ఇదే అదనుగా భావించి అక్రమార్కులు ఇసుకను దోచుకెళ్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమ ఇసుక రావాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్, జైపాల్ యాదవ్

హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

» బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, ఏప్రిల్ 24 : శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై ఆ పార్టీని ప్రజలు నిలదీయాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాల పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన రోడ్డుషోలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి తదితరులతో కలిసి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చే దిశగా బీజేపీ కుట్రలు పన్నుతుందని, దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణను అస్థిర పరిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీలు అనురాధపత్యానాయక్, దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



వికారాబాద్ : ఎస్ఏపీ కళాశాలలో వాకర్స్‌తో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 24 : భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ పట్టణంలో తెల్లవారుజామున పర్యటించారు. ముందుగా ఎస్ఏపీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం డైట్ కళాశాల, అనంతగిరిలో వాకర్స్‌ను కలిసి మాట్లాడి గిరిగేట్‌పల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. మే 13న జరుగనున్న ఎన్నికల్లో ప్రజలంతా భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టాలని విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. ప్రచారంలో వికారాబాద్ జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

కులకచర్ల, ఏప్రిల్ 24: మూడోసారి మోదీ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, జనాదరణ కలిగిన నేతగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి అన్నారు. బుధవారం కులకచర్ల మండలంలోని రాంపూర్ గ్రామంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ పరిపాలనలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గడుసు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, పాశం నర్సింహారెడ్డి, మండల కోశాధికారి కాటన్‌పల్లి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి నరేంద్రమోదీయే పీఎం

వికారాబాద్ : దేశంలో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కాబోతున్నారని, ప్రజలందరూ మరోసారి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి కోరారు. బుధవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని బీటీఎస్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని నెంబర్‌వన్ స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో నరేంద్రమోదీ పనిచేస్తున్నారని తెలిపారు. ఈసారి 400లకు పైగా ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. నాయకులు రాజేందర్ రెడ్డి, పోకల సతీష్, శిరీష సుచిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్‌లో ప్రచారం చేస్తున్న రాము, తదితరులు

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

షాబాద్, ఏప్రిల్ 24 : ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, బీజేపీ స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము అన్నారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. బుధవారం షాబాద్‌లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కేంద్రప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిలో దూసుకుపోతున్నదని, ప్రపంచం మొత్తం భారత్‌వైపు చూస్తున్నదన్నారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, నాయకులు వినయ్, రాజు, నరేష్, శంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో కేరెల్లిలో భూ సర్వే

పూడూరు, ఏప్రిల్ 24 : మండల పరిధిలో కేరెల్లి గ్రామంలో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం చెన్‌గోముల్ ఎస్సై మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని సర్వేనెంబర్-94 గల భూమిని సర్వే చేయించారు. గతంలో ఈ భూమి గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం 11 ఎకరాలు ఉండగా, ఇదే సర్వేనెంబర్‌లో గ్రామానికి చెందిన ఇబ్రహీం అనే వ్యక్తికి 21 ఎకరాల 22గుంటలు ఉన్నట్లు ఆయనకు ఇచ్చిన పట్టాలో ఉంది. అయితే, రికార్డు తప్పుగా రాయడం వల్ల అలా జరిగి ఉంటుందని గ్రామస్తులు ఆరోపించారు. ఒకవేళ సర్వేనెంబర్-94లో ఇబ్రహీంకు 21ఎకరాల 22గుంటల భూమి ఉంటే, మా చుట్టుపక్కల ఉన్న సర్వేనెంబర్లలో కూడా మా భూమి మాకు ఉండాలని వారు ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన మహ్మద్ జాఫర్ సర్వేనెంబర్ 94కు ఆనుకుని ఉన్న 75/26 సర్వే నెంబర్లలో 2 ఎకరాల 39గుంటల అనువంశికంగా వచ్చిన అసైన్డ్ భూమి ఉంది. కొత్తగా కోర్టు ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం.. అధికారులు ఇప్పుడున్న సర్వే లెక్క ప్రకారం చూస్తే జాఫర్‌కు ఉన్న అసైన్డ్ ల్యాండ్‌కు 94 సర్వేనెంబర్‌లో కలిసిపోతుంది. కావాలని గత రికార్డులను మార్చి కొందరు భూదందాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామ రికార్డు ప్రకారమే కోర్టు సర్వే నిర్వహించాలని ఆదేశించిందని అన్నారు. తమకు అన్యాయం జరిగితే ఎక్కడికైనా వెళతామని వారు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సర్వే చేస్తానని సర్వేయర్ తెలిపారు.



సర్వేయర్‌తో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

విద్యార్థులు, తల్లిదండ్రులు ఒత్తిడికి గురికావద్దు

» జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్



వికారాబాద్, ఏప్రిల్ 24 : పరీక్ష ఫలితాల సమయంలో విద్యార్థులు భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు ఒత్తిడికి గురికావద్దని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులు కాలేకపోతే ఒత్తిడి, అభద్రతకు గురికావద్దని, ఆత్మహత్యలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావొచ్చని తెలిపారు. ఎంతో మంది మేధావులు, ప్రాథమిక స్థాయిలో ఫెయిలైనా అధైర్య పడకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. జీవితం చాలా విలువైందని, మీపై ఎన్నో ఆశలతో కంటికి రెప్పలా చూసుకునే తల్లిదండ్రులకు శోకాన్ని మిగల్చకూడదని, జీవితం అంటే పరీక్షలు మాత్రమే కాదని, జీవితంలో పాస్ కావడం ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి గురైతే.. జిల్లాలో జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం టోల్‌ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదించి ప్రత్యేక వైద్య నిపుణులు, కౌన్సెలర్‌తో మాట్లాడాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల పరీక్ష మార్కులను కొలమానంగా మాత్రమే చూడవద్దని, ఎన్నో రంగాల్లో అవకాశాలు ఉంటాయని, ఇతర విద్యార్థులతో పోల్చవద్దని తెలిపారు. ఒకవేళ మీ పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు గుర్తిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్‌చేసి కౌన్సెలింగ్ ఇప్పించాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే సరైన నిద్ర, మంచి ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, ఫోన్ వాడకం తగ్గించడం, స్నేహితులతో గడపడం వంటివి చేయాలన్నారు.

పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

» నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి



మాట్లాడుతున్న నల్ల మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 24 : ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, జీవనశైలిలో క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవర్చుకుంటే ఉన్నత లక్ష్యాలను అధిగమిస్తారని తెలిపారు. నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి తెలిపారు. మండల పరిధి కాచవానిసింగారం, దివ్యానగర్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 13వ పారిశ్రామిక సంస్థ పరిశోధన(ఐఐఆర్ఎం) సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, దానికోసం పుస్తక పఠనంతో పాటు పరిశ్రమలకు వెళ్లి పరిశోధనలు చేయాలని సూచించారు. సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సమావేశానికి డీఎక్స్‌సీ టెక్నాలజీ, కాగ్నిజెంట్, గ్రేడియస్ టెక్నాలజీ, ఏకేఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఎన్ఐసీఎంఏఆర్, జెన్ టెక్నాలజీస్, థైజెన్ ల్యాబ్స్, సత్వ బయోలాజీస్ తదితర 13 ప్రముఖ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్లమల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ నల్ల దివ్య, ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ రమేష్, ఎంబీఏ హెచ్‌వోడీ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు

» ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 : ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైందని, 18 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరు లోక్‌సబ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణ సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీసి, మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. వయోవృద్ధులు, వికలాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఓటును వినియోగించుకునేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సీడీపీవో జి.శాంతిశ్రీ, మండల పరిషత్ సూపరింటెండెంట్ క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో సూరజ్‌కుమార్

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కందుకూరు, ఏప్రిల్ 24 : ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ నాయకులు సహకరించాలని ఆర్డీవో సూరజ్‌కుమార్ అన్నారు. బుధవారం రాజకీయపార్టీల నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డారు. శాసనసభ ఎన్నికల్లో మహేశ్వ రం నియోజకవర్గంలో 541 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ ఎన్నికల్లో 437 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎప్పటికపుడు కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ జంగారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రాజకీయ నాయకులు అఫ్జల్‌బేగ్, డిల్లీ శ్రీధర్, ప్రభాకర్‌రెడ్డి, అందుగుల సత్యనారాయణ, తల్లోజు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 24: కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్ల చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడినవారు ఎవ్వరు కూడా బిల్లు చెల్లించరాదని, బలవంతంగా ఎవరైనా అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, బ్లాకబీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు రాములు, ఆనందం, లాల్‌కృష్ణ, బాలముకుందం, కుమ్మరి స్వామి, యాదయ్య, నర్సిములు, స్థానిక ఎంపీటీసీ ఆనందం, వెంకటేశ్ కార్యకర్తలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కులకచర్ల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

రాజేంద్రనగర్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ విద్వేషాలు రగిలించి మతాల మధ్య చిచ్చు పెడుతోందని, చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి అన్నారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మైలార్ దేవులపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనంజయ్ ఆధ్వర్యంలో సీతారెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారెడ్డి ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి రంజిత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలతో ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాటిస్తే తప్పదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని ఆమె తెలిపారు.

రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. చేవెళ్ల ప్రాంతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూర్‌రెడ్డి సాయిరెడ్డి, బొల్ల వెంకటేశ్, బ్లాక్ ప్రెసిడెంట్ మూముద్, కాలిక్, వెంకటేశ్, లక్ష్మణ్, శ్రీశైలం, రత్నం, శ్రీనివాస్, శివ, సతీష్, గంగయ్య, అశోక్, సద్గుణచారి, ఉస్మాన్, పాండు కిశోర్, బాబు, నరసింహ యాదవ్, ఓం ప్రకాష్, రాజ్ కుమార్, యాదయ్య, సవితారెడ్డి, గీత, ఫరీద్, జుబేద్, దస్తగీర్, ఆంజనేయులు, శారద, మమత, ప్రియాంక, మహేశ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, రమేశ్ ముదిరాజ్, గోపి, నాగరాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఆమనగల్లు, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల వేడుకల్లో భాగంగా దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. గౌరారంతో పాటు ఆమనగల్లు, మాడ్గుల మండలాల నుంచి భక్తులు విగ్రహ ప్రతిష్ఠాపనకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులకు ఎంపీటీసీ నిట్టమంగమ్మ నారాయణ, మాజీసర్పంచ్ శ్రీపాతిరజిత శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు దోనాదుల వెంకట్రాములు, కార్యదర్శి చిట్టిగోరి బాస్కర్‌రావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులు, నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నిట్ట నారాయణ, నాయకులు ఆంజనేయులురావు, శంకరయ్య, శ్రీపాతి సాయిరెడ్డి, నల్లబోలు అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రాద్, లక్ష్మణ్ రావు, శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు, భక్తులు

అంగరంగ వైభవంగా శ్రీ రామలింగేశ్వర స్వామి రథోత్సవం



యాచారం : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో బుధవారం శ్రీ రామలింగేశ్వర స్వామి వారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారి రథోత్సవంలో పాల్గొని రథాన్ని లాగారు. అంతకు ముందు స్వామి వారి విగ్రహాలను రథంపై ఊరేగించేందుకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు జరిపారు. జాతరకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. రథోత్సవానికి ముందు స్వామి వారి హుండీ ఆదాయం రూ.6లక్షలు వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ శంకర్‌కుమార్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు
- అభినందించిన అధ్యాపకులు, తల్లిదండ్రులు


ఎ.నవీన్, ఎంపీసీ, 465/470(జ్యోతిబాపూలే గురుకుల కళాశాల, కీసర


శ్రీమాన్విత, బైపీసీ, 984/100 స్ఫూర్తి కళాశాల, మేడ్చల్


ఎస్.సాయికీర్తన, బైపీసీ 987/1000, గ్లోబల్ కాలేజీ, పరిగి


మహిరాసమర్ బైపీసీ, 988/1000-గ్లోబల్ జూనియర్ కాలేజీ, పరిగి

వికారాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఈసారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సత్తా చాటాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లోనూ వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అగ్రస్థానంలో నిలిచింది. ఈ కళాశాల ప్రథమ సంవత్సరంలో 45.37 శాతం, ద్వితీయలో 66.37 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కళాశాలల్లో మేటిగా నిలిచింది.

వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అగ్రగామిగా నిలిచారని ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ నుంచి కె. మహలక్ష్మి 966, కె. స్రవంతి 925, బైపీసీలో కె.అంజలి 958, స్పందన 928, జకీయ 912, అయేషా 8877, సీఈసీలో కె.నవనీత 920, అశోక్ 886, హెచ్ఈసీలో రాఘవేందర్ 809, రైసాబేగం 924, మొదటి సంవత్సరంలో మౌనిక 455, సుజాత 430, బైపీసీ నుంచి మనోజ్ కుమార్ 410, సీఈసీలో కె. అక్షయ 457, హెచ్ఈసీలో మహేందర్ 425 ఉత్తమ మార్కులు సాధించారని అన్నారు. విద్యార్థులను అధ్యాపకులను అభినందించారు. వికారాబాద్ జిల్లాలో వెనుకబడిన తరగతుల వసతి గృహంలో మొదటి సంవత్సరం 266 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 146 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినటట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె. ఉపేందర్ తెలిపారు. వసతి గృహంలో వారిగా చూసినట్లయితే 55 శాతం ఉత్తీర్ణత సాధించారని, జిల్లా స్థాయిలో 53 శాతం మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం 300 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 220 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వసతి గృహం వారిగా చూసినట్లయితే 73 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత కలిగి ఉన్నారని, అదే విధంగా జిల్లా వారిగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 61 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత శాతం ఉందని ఆయన పేర్కొన్నారు. వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం మాదిరిగానే సీఈసీ , హెచ్ఈసీ గ్రూపులతో పాటు ఈ సంవత్సరం బైపీసీలో రికార్డు మార్కులు సాధించారని వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు సీనియర్ అధ్యాపకులు ప్రభాకర్ రెడ్డి, రాంచందర్ విద్యార్థులను అభినందించారు. ఏసీఆర్ భృంగి కళాశాల విద్యారులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించడం జరిగిందని కళాశాల కార్యదర్శి ప్రమీల చంద్రశేఖర్ అన్నారు. ఎంపీసీ ఇందు 467, బైపీసీలో చందన ప్రీతి 436 మార్కులు సాధించగా ఎంపీసీ ద్వితీయలో అశ్వియ 978, బైపీసీలో సాహస్త 966, సీఈసీ ముస్కాన్ కాతూన్ 964 మార్కులు సాధించడం జరిగిందన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంగం లక్ష్మీబాయి గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకుల కృషి ఫలించి విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల ప్రిన్సిపల్ గోపీశెట్టి రమణమ్మ తెలిపారు. ఎంపీసీలో హేమవతి 466 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని, బైపీసీలో సంధ్యారాణి 436 మార్కులు సాధించారన్నారు. బైపీసీ ద్వితీయలో జాహ్నవి 982 మార్కులు సాధించగా.. ఎంపీసీలో అక్షయ 988 మార్కులు సాధించడం జరిగిందన్నారు. అలాగే ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి తెలిపారు. ఎంపీసీలో డి.మౌనిక 455 మార్కులు, ద్వితీయలో మహలక్ష్మి 966 మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. సీఈసీలో దుర్గలక్ష్మి 445లు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా, వికారాబాద్ ఇంటర్ ఫలితాల్లో వికారాబాద్ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కె.సాహితి ఎంపీసీలో 990 మార్కులు సాధించారు. బైపీసీలో ఎండీ ముసబ్‌ఖాన్‌కు 988 మార్కులు రాగా, సీఈసీలో ఎండీ ముజైఫ్‌ఖాన్‌కు 950 మార్కులు, ఎంఈసీలో టి.నిహారిక 921 మార్కులు వచ్చాయి. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో బి.నితిన్‌కుమార్ 463 మార్కులు సాధించగా, బైపీసీలో అఫియా మహజబీన్ 437 మార్కులు, సీఈసీలో సనా అఫ్రీన్ 479, ఎంఈసీలో జి.హరిత 489 మార్కులతో టాపర్లుగా నిలిచినట్లు సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.జయదేవ్ తెలిపారు.

తాండూరు : ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కాలేజి విద్యార్థులు సత్తా చాటారు. తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలో చదువుతున్న విద్యార్థిని సులేమాన్ హస్మి ఇంటర్ ఫలితాల్లో సెకండ్ ఇయర్ ఉర్దూ మీడియం నుంచి బైపీసీలో 990 మార్కులు సాధించి తాండూరు టాపర్‌గా నిలిచారు. ప్రభుత్వ కాలేజీ నుంచి విద్యార్థిని ఘనత సాధించడం పట్ల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సులేమాన్ హస్మిని అభినందించారు.

తాండూరు రూరల్ : మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల కొనసాగుతోంది. మొదటి సంవత్సరంలో 79 మంది విద్యార్థులకుగాను 59 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయలో 77 మంది విద్యార్థులకు గాను 53మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్ తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకుగాను 457 మార్కులు నందిని, బిందులకు సాధించారు. బైపీసీలో 440 మార్కులకుగాను 414 మార్కులు నిహారిక, శివాణీలు సాధించారన్నారు. అలాగే తెలంగాణ మోడల్ స్కూల్లో రెండవ సంవత్సరంలో 77 మంది విద్యార్థులకు గాను 53మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. బైపీసీలో అనూషకు 1000 మార్కులకు 958 వచ్చాయన్నారు. ఎంపీసీలో శ్రీవాణికి 1000 మార్కులకు గాను 925 మార్కులు వచ్చాయని తెలిపారు.

బంట్వారం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 63 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 14మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సరళరెడ్డి తెలిపారు. ఎంపీసీలో భానుప్రసాద్ 328, బైపీసీలో మహేక్ సద్దిక్‌కు 356, ఇంటర్ సెకండియర్‌లో 66 మందికిగాను 27 మంది ఉత్తీర్ణులయ్యారు.

మర్పల్లి : మండల పరిధిలోని పంచాలింగాల గ్రామానికి చెందిన పి.అనూష మర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండియర్‌లో 1000 మార్కులకుగాను 959 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

పరిగి : పరిగి గ్లోబల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రతిభను చాటారు. పరిగి పట్టణానికి చెందిన బైపీసీ సెకండియర్‌లో మహిరా సమర్ 988/1000 సాధించారు. ఎంపీసీలో ఎస్.సాయికీర్తన 987/1000 సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో బి.నిహరిక 436/440, ఉజ్మాపాతిమాకు 436/440, ఎంపీసీలో జి.కార్తీక 466/470 మార్కులు సాధించారు. పరిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సెకండ్ ఇయర్‌లో 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. 163 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 113 మంతి ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 34 శాతం ఉత్తీర్ణత సాధించారు. 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50 మంది ఉత్తీర్ణత సాధించారు.


శ్రీయ, బైపీసీ (ఇంగ్లీష్ మీడియం) 985 / 1000 శ్రీచైతన్య జూనియర్ కళాశాల (తాండూరు)


అవదూత్, ఎంపీసీ, 987/1000, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, తాండూరు

పూడూరు : ఇంటర్ ఫలితాల్లో పూడూరు మండల విద్యార్థులు సత్తాచాటారు. తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థుల విద్యార్థిని అరుంధతి ఇంటర్ ద్వితీయలో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు.

నవాబుపేట/బొంరాస్‌పేట్ : నవాబుపేట మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఎంపీసీలో ఎం.అనూష 769, బైపీసీలో యం.వైష్ణవి 933, సీఈసీలో బి.మాధవి 787 మార్కులు సాధించి కళాశాల టాపర్‌లుగా నిలిచినట్లు అధ్యాపకులు తెలిపారు. బొంరాస్‌పేట్ మండలం లింగన్‌పల్లి గ్రామానికి చెందిన బడెంపల్లి విష్ణు బైపీసీలో 1000 మార్కులకు గాను 940 మార్కులు సాధించాడు.

మోమిన్‌పేట్ : ఇంటర్ ద్వితీయ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బైపీసీలో లీనాకుమారి 904 మార్కులు, సీఈసీలో వి.రేఖ 904 మార్కులు, యంపీసీలో శ్రీనివాస్‌రెడ్డి 916 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ చెన్నయ్య తెలిపారు.

దోమ : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 98 మంది పరీక్షలు రాయగా 35 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ద్వితీయలో 124 మంది పరీక్షకు హాజరు కాగా 82 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు.



తాండూరు : విద్యార్థులను సన్మానిస్తున్న భాష్యం కళాశాల అధ్యాపకులు

కొడంగల్/కొడంగల్ రూరల్ : ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న శివగారి పూజ 958 మార్కులు సాధించింది. హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్.రజిత 843, ఎంపీసీలో పి.కృష్ణకుమార్ 835, మొదటి సంవత్సరం హెచ్ఈసీలో బి.అంజిలయ్య 401, బైపీసీలో కంద్రె అశ్విని 408, యంపీసీలో శివ నర్సింహా 399 మార్కులు సాధించారు. పాత కొడంగల్ గిరిజన గురుకుల కళాశాలకు చెందిన 23 మంది సెకండియర్ విద్యార్థులకు గాను 14 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో 24 మంది విద్యార్థులకు గాను 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బల్‌రాం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

కీసర రూరల్ : నాగారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్‌పుర నియోజకవర్గాలకు చెందిన మహాత్మా జ్యోతి బాపూలే కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు 46 మంది రాయగా 43 మంది ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ఫస్ట్ ఇయర్ పరీక్షలు 43 మంది రాయగా 33మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న నవీన్ అనే విద్యార్థి 470 మార్కులకు గాను 465 సాధించాడు. అదే విధంగా సెకండ్ ఇయర్ విద్యార్థులు పలువురు 900లకు పైగా మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్స్‌పాల్లు పీఎన్ చారి, అంజన్నలు అభినందించారు.

ఘట్‌కేసర్ : ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఘట్‌కేసర్‌లోని రిషీ బాలికల, స్థానిక శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు 80శాతం ఉత్తీర్ణత సాధించారు. బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ఆద్యాపకులు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. ఘట్‌కేసర్‌లోని రిషి బాలికల, స్థానిక శ్రీచైతన్య కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలీలా ఉన్నాయి.

మేడ్చల్ టౌన్ : ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మేడ్చల్ విద్యార్థులు తమ ప్రతిభ చాటుకున్నారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థి అర్షియా 986, ఎంపీసీ విద్యార్థిని లక్ష్మీకచువ 984, బైపీసీ విద్యార్థిని డి.శ్రీమాన్విథ 984, ఎంపీసీ విద్యార్థిని వి.వైష్ణవి 982 మార్కులు సాధించారు. ఇదే కాలేజీకి చెందిన ఫస్టియర్ విద్యార్థిని ఎస్.కీర్తన 464, ఎంపీసీ విద్యార్థి మోహన్ 464 మార్కులు సంపాదించారు.

ఘట్‌కేసర్ రూరల్ : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని అవుషాపూర్ శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ సెకండ్‌ఇయర్ పరీక్ష ఫలితాల్లో ఎంపీసీ విభాగానికి చెందిన బొరుగుల మోహన్ 1000/ 992 మార్కులు సాధించాడు. హుజూరాబాద్ పట్టణంకు చెందిన బొరుగుల మోహన్ తండ్రి బొరుగుల రాజయ్య వ్యవసాయం కూలీ. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపీసీ విభాగానికి చెందిన మారం సాయి గౌతం 470/466 మార్కులు, రేగొటి సాయితేజ ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాలలో 470/466 మార్కులు సాధించారు. జనగామ జిల్లా, స్టేషన్ ఘనాపూర్‌కు చెందిన మారం సాయిగౌతం తండ్రి వినయ్‌కుమార్ దినసరి కూలీ, యాదాద్రి-భువనగిరి జిల్లా, అలేరుకు చెందిన రేగొటి సాయితేజ తండ్రి వెంకటేష్ సైతం దినసరి కూలీ. ఇంటర్ పరీక్ష ఫలితాలలో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని శ్రీచైతన్య ప్రిన్సిపల్స్ రామకృష్ణ, సుమన్, డీన్ టీఎస్‌ఆర్‌లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

రైల్లోంచి కిందపడి దివ్యాంగుడు మృతి

నవాబుపేట, ఏప్రిల్ 24: రైల్లోంచి కిందపడి ఓ దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద-వికారాబాద్ రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగింది. వికారాబాద్ మండలంలోని సిద్దలూర్ గ్రామానికి చెందిన దయ్యాల గోపాల్(50) గ్రామం నుంచి లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు బుధవారం వచ్చాడు. ఈక్రమంలో రైలులో ప్రయాణిస్తుండగా కిందపడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతిచెందిన వ్యక్తి దివ్యాంగుడని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. మృతదేహానికి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రైలుకింద పడి మరొకరు..

బషీరాబాద్, ఏప్రిల్ 24: రైలుకింద పడి ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన నవాంద్గీ(బషీరాబాద్) రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన సందీప్‌ప్రసాద్(37) బుధవారం తెల్లవారుజామున ఇంట్లోంచి దగ్గరలోని రైలు పట్టాల వైపు వెళ్లాడు. ఈ క్రమంలో గూడ్స్ రైలు రావడంతో అతడిని ఢీకొట్టింది. దాంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ట్రైన్ పైలట్ సమాచారంతో స్థానిక స్టేషన్‌మాస్టర్ తాండూరులోని రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అక్కడి ఆనవాళ్లు గుర్తించి మృతుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు. కుటుంబీకులు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టి మృతిచెంది ఉండోచ్చని అనుమానిస్తున్నారు. మృతికి గల కారణలపై విచారణ జరిపిన పోలీసులు మృతదేహాన్ని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి ..

వికారాబాద్, ఏప్రిల్ 24 : అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కొత్తగడి గ్రామ శివారులో అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి శవం లభించిందని, వయస్సు దాదాపు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, బూడిద కలర్ చొక్కా, క్రీమ్ కలర్ ప్యాంటు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే సెల్ 8712670030కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

బాలికపై యువకుడి లైంగిక దాడి

- గర్భం దాల్చిన పదో తరగతి విద్యార్థి
- పోలీసులకు కుటుంబీకుల ఫిర్యాదు.. కేసు నమోదు

బషీరాబాద్, ఏప్రిల్ 24 : బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడటంతో గర్భం దాల్చింది. ఈ సంఘటన బషీరాబాద్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బాలిక కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16) ఇటీవల పదోతరగతి పూర్తి చేసింది. అదే గ్రామానికి చెందిన కర్రె నరేష్(24) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో బాలికపై కన్నేసిన అతడు.. రోజూ పాఠశాల ఎదుట ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోను నిలిపేవాడు. బాలికతో మాటలు కలిపి ఏడాది కాలంగా ప్రేమ వ్యవహారం నడిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాలికపై పలుమార్లు యువకుడు లైంగిక దాడికి పాల్పడగా గర్భం దాల్చింది. బాలిక నడవడిక, తీరుపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ప్రశ్నించగా.. అసలు విషయం చెప్పింది. తన కూతురుకు జరిగిన అన్యాయంపై తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం కుల పెద్దల దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తల్లిదండ్రులు బాలికతో పాటు బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి పంపించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 24 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి మునీరాబాద్ గ్రామంలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీకాంత్(26) అనే వ్యక్తి గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్ క్యాష్ బ్యాగ్ నుంచి రూ.10వేలు అపహరణ

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 24 : మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన ఓ కండక్టర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో అతడి వద్ద ఉన్న క్యాష్‌బ్యాగ్ నుంచి గుర్తుతెలియిన దండగుడు రూ.10వేలు దొంగిలించాడు. మంగళవారం రాత్రి మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు రామాయంపేట నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరి మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చేరుకుంది. అప్పటికే టిక్కెట్ల ద్వారా ప్రయాణికుల నుంచి స్వీకరించిన డబ్బు రూ.10వేలు కండక్టర్ సాయికుమార్ లెక్కించి తన క్యాష్‌బ్యాగులో భద్రపరుచుకున్నాడు. మేడ్చల్ డిపో వద్దకు చేరుకున్న అనంతరం క్యాష్ బ్యాగ్‌లో డబ్బులు కనబడలేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బక్కారెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 24: ఉమ్మడి కులకచర్ల మండల పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు సీఈవో బక్కారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి మురళి, సిబ్బంది బాలు, మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

పక్షులకు తాగునీటి వసతి ఏర్పాటు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 24: వేసవిని దృష్టిలో ఉంచుకొని బొంరాస్‌పేట్ ఎంపీడీవో శ్రీదేవి బుధవారం తన కార్యాలయం ఆవరణలోని చెట్ల మధ్యలో చిన్న మట్టి కుండల్లో పక్షులకు తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు పక్షుల ప్రేమికులు ప్రతీఒక్కరు తమ తమ ఇంటి ఆవరణలో నీటి వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహేశ్వరి, రాకేశ్, ఆండాలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పూడూరు : మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన తులసీబాయి, రాజు దంపతుల కుమార్తె మంజుల వివాహం బుధవారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెంటన్న హాజరై వధువు కుటుంబానికి రూ.11,000వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఘట్‌కేసర్ రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సీటు బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ప్రతాప్ సింగారం మాజీ సర్పంచ్ వంగూరి శివశంకర్ తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా, అంతాయపల్లిలో జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి ప్రతాప్‌సింగారం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ గత పదేళ్ళలో మంచినీటికి, విద్యుత్‌కు ఇబ్బంది లేకుండేనని, కాని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి, విద్యుత్ సమస్యలు ఎక్కువ అయ్యాయని గుర్తుచేశారు. కేసీఆర్ జిందాబాద్, కేటీఆర్ జిందాబాద్, జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేసి అంతాయపల్లికి తరలివెళ్ళారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు తరలివెళ్ళారు.

శామీర్‌పేట : గ్రామాభివృద్ధికి, ప్రజలకు సర్పంచ్‌గా రామరాజుయాదవ్ చేసిన పనులు, సేవలు మరువలేనివని మాజీసర్పంచ్, ఆయన కుమారుడు బత్తుల కిశోర్‌యాదవ్ అన్నారు. బుధవారం శామీర్‌పేటలోని కిశోర్‌యాదవ్ నివాసంలో దివంగత మాజీ సర్పంచ్ రామరాజుయాదవ్ 16వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు విచ్చేసి రామరాజుయాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ రామరాజుయాదవ్ రెండుసార్లు సర్పంచ్‌గా గ్రామాన్ని అభివృద్ధి పర్చారన్నారు.

నీటి వృథా.. ఎవరికీ పట్టదా?


నవాల్గ గ్రామం మహేందర్‌రెడ్డి కాలనీలో కుళాయి వద్ద వృథాగా పోతున్న తాగునీరు

బషీరాబాద్, ఏప్రిల్ 24: అసలే వేసవి కాలం.. 40 డిగ్రీలకు పైగా ఎండలు మండుతున్నాయి. ఓ పక్క భూగర్భజలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. మరోపక్క బోర్లు వట్టిపోతుండటంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రతీ నీటి చుక్కనూ కాపాడుకుని అవసరాలకు వాడుకోవాల్సిన పరిస్థితి. కానీ పలు గ్రామాల్లో నీటిని వృథా చేస్తున్నారు. కుళాయిలకు ఆఫ్ ఆన్ సిస్టం లేకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ఒకవైపు నీటి సమస్యను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంటుండగా, క్షేత్రస్థాయి సిబ్బందికి అంత శ్రద్ధ ఉండటం లేదు. కొందరు ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు చూడటం లేదు. ఫలితంగా నీటి వృథాను అడ్డుకునేవారు కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ గ్రామంలో కుళాయి నీరు వృథాగా పోతున్న దృశ్యాలు కన్పిస్తున్నా.. ఎవరూ అంతగా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బషీరాబాద్ మండలం నవాల్గలోని మహేందర్‌రెడ్డి కాలనీలో ప్రధాన రోడ్డుపక్కన కుళాయికి ఆఫ్ ఆన్ సిస్టం లేక నీరు వృథాగా పోతుండగా బుధవారం 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి


మదన్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 24: మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని మదన్‌పల్లి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. మదన్‌పల్లి, మదన్‌పల్లి తండా, గట్యానాయక్ తండా తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములుగౌడ్, నర్సిములు, రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, నర్సిములునాయుడు, భీమయ్యగౌడ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హజ్రత్ షాహీ ఖాద్రి ఉత్సవాలు


ఎక్‌మామిడిలో హజరత్ సయ్యద్ షాహి ఖాద్రి దర్గా

నవాబుపేట, ఏప్రిల్ 24: మండలంలోని ఎక్‌మామిడి గ్రామంలో నేటి(గురువారం) నుంచి హజ్రత్ సయ్యద్ సాహెబ్ హుసేన్ షాహి ఖాద్రి ఉర్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎండీ వహీద్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం గంధోత్సవం నిర్వహించడం జరుగుతుందని, ఉత్సవాలకు ఎక్‌మామిడి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా నృసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవం


ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మారుతి కిరణ్, తదితరులు

దోమ, ఏప్రిల్ 24: మండలంలోని మల్లెపల్లి గ్రామంలో బుధవారం శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పరిగి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనెటి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడం కోసం స్వామి వారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ, టెలికాం అడ్వజయిరీ కమిటీ సభ్యులు హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, ఓబీసీ మోర్చా పరిగి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ విజయ్, పూడూరు మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రమేశ్, బీజేపీ నాయకుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కాళికాదేవి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కులకచర్ల, ఏప్రిల్ 24: మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. దీపారాధన, హోమం, కుంభం, ప్రత్యేక పూజలను విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు కులకచర్ల, అంతారం, ఘనపూర్ తదితర గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

వైభవంగా ఆంజనేయస్వామి దేవాలయం జాతర

యాలాల, ఏప్రిల్ 24: యాలాల మండలం హాజీపూర్ గ్రామ శివారులో గల బాకారం ఆంజనేయ స్వామి దేవాలయ జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా యాలాల ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ గుప్తా మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.